




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు

'నామినేటెడ్' ఎవరికో..?

- ఇప్పటికే సుబ్బారెడ్డికి పదవి
- రేసులో పలువురు ఆశావహులు





తిక్కారెడ్డి



వాహిద్ హుస్సేన్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఇప్పటికే డోన్ నియోజకవర్గం నుంచి ధర్మవరం సుబ్బారెడ్డిని ఎపి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి వరించింది. మరికొన్ని కార్పొరేషన్ ఛైర్మన్లను ప్రకటించాల్సి ఉండటంతో ఇంకా నామినేటెడ్ పదవులు ఎవరికి దక్కుతాయోనన్న ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో ఆశావహులు భారీగానే ఉన్నారు. వారందరూ టిడిపి అధిష్టానంపై ఆశలు పెట్టుకున్నారు. తమకు ఏదో ఒక పదవి దక్కుతుందన్న ఆశాభావంతో ఉన్నారు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో టిడిపి కూటమి మంచి విజయాన్నే సాధించింది. జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా 11 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి, ఒక అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థి కూటమి తరపున గెలుపొందారు. రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల్లో సీట్ల కేటాయింపు సమయంలో కొందరు అభ్యర్థులకు మొండి చేయి చూపి ఇతరులకు సీటును కేటాయించారు. వారికి ఏదో ఒక పదవి ఇస్తామంటూ బుజ్జగించారు. అలాంటి వారందరూ ప్రభుత్వంలో తమకు ఏదో ఒక నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఇప్పటికే ఎపి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మన్నె ధర్మవరం సుబ్బారెడ్డిని నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 కార్పొరేషన్లకు ఛైర్మన్లను ప్రకటించగా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ధర్మవరం సుబ్బారెడ్డికి స్థానం దక్కింది. 2019లో టిడిపి ఓటమి పాలయిన తరువాత సుబ్బారెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఆ తరువాత ప్యాపిలి మండలం జలదుర్గంలో జరిగిన బాదుడే బాదుడు సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డోన్ టిడిపి అభ్యర్థిగా సుబ్బారెడ్డిని ప్రకటించారు. తీరా ఎన్నికల సమయంలో ఆయనను కాదని డోన్ సీటును కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ఇచ్చారు. అప్పుడు తన సీటును వదులుకున్నందుకు సుబ్బారెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సుబ్బారెడ్డికి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించారు.

ఇంకా కొన్ని కార్పొరేషన్లకు ఛైర్మన్ పదవులను ప్రకటించాల్సి ఉండటంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. టిడిపి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించడంతో ఎవరికి వారు తమ తమ స్థాయిలో జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, ఆదోని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జీ మీనాక్షి నాయుడు, కోడుమూరు నియోకవర్గ సమన్వయకర్త విష్ణువర్ధన్ రెడ్డి, నంద్యాల నియోజకవర్గ మాజీ ఇంఛార్జీ భూమా బ్రహ్మానంద రెడ్డి, మైనార్టీ నాయకులు వాహిద్ హుస్సేన్ ఉన్నారు. రెండు సార్లు మంత్రాలయం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయి 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అనుకున్న పాలకుర్తి తిక్కారెడ్డి ఆయన సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. రాఘవేంద్రరెడ్డికి టిడిపి టికెట్ ఇచ్చారు. తిక్కారెడ్డికి టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించారు. అధికారంలోకి వస్తే సమున్నత పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చింది. దీంతో ఆయన ప్రస్తుతం నామినేటెడ్ పదవుల భరీలో ఉన్నారు. పదవులు ఆశిస్తున్న వారిలో డోన్ నియోజకవర్గ మాజీ ఇంఛార్జి ధర్మవరం సుబ్బారెడ్డి కూడా ఉన్నారు. 2019లో టిడిపి ఓటమి పాలయిన తరువాత సుబ్బారెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఆ తరువాత ప్యాపిలి మండలం జలదుర్గంలో జరిగిన బాదుడే బాదుడు సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డోన్ టిడిపి అభ్యర్థిగా సుబ్బారెడ్డిని ప్రకటించారు. తీరా ఎన్నికల సమయంలో ఆయనను కాదని డోన్ సీటును కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ఇచ్చారు. ఇప్పుడు సుబ్బారెడ్డికి నామినేటెడ్ పదవి ఇస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. నంద్యాల టికెట్ ఆశించిన భూమా బ్రహ్మానందరెడ్డి, వాహిద్ హుస్సేన్‌లకు మొండిచేయి చూపి ఆ టికెట్‌ను ఎన్ఎండి ఫరూక్‌కు ఇచ్చారు. ఆ సమయంలో వారికి న్యాయం చేస్తామని అధిష్టానం హామీ ఇచ్చింది. ఫరూక్ గెలుపుకు కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు టిడిపి అధిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా పని చేసిన కోట్ల సుజాతమ్మ, మాజీ మంత్రి కెఇ ప్రభాకర్, రాష్ట్ర గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడిగా పని చేసిన నాగేశ్వర్ యాదవ్‌తో పలువురు జనసేన, బిజెపి నేతలు కూడా నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆరంభం.. అట్టహాసం..

- సిబిఎస్ఈ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం
- క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి విజేతలుగా రాణించండి : ఎంపీ బస్తిపాటి నాగరాజు



పోటీల్లో తలపడుతున్న ఇరు జట్లు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో సిబిఎస్‌సి క్లస్టర్-7 ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఫుట్ బాల్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి అండర్ 14, 17, 19 బాలుర జట్లు 143 పాఠశాలల నుండి 3500 మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పోటీలను ప్రారం భించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి విజేతలుగా రాణించాలన్నారు. కర్నూలులో ఇంత పెద్ద టోర్నమెంట్ నిర్వహిం చడం ఇదే ప్రథమన్నారు. ఇందుకు రిడ్జ్ స్కూల్ వేదిక కావడం ఎంతో విశేషం అన్నారు. విద్య మరియు క్రీడలు రెండు కళ్ళలాంటివని దేనిని నిర్లక్ష్యం చేయక రెండింటి నందు రాణించాలని గుర్తు చేశారు. రవీంద్ర యాజమాన్యం వారు చక్కటి ఏర్పాటు చేసి క్రీడాకారులకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు ఎంపీ సూచించారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి పుల్లయ్య మాట్లాడుతూ ఈ భారీ టోర్నమెంట్ నిర్వహించ డానికి అవకాశం ఇచ్చిన సీబీఎస్ఈ బోర్డుకు ధన్యవాదాలు తెలిపారు. క్రీడలతో మంచి ఆరోగ్యం మంచి క్రమశిక్షణ కలుగుతాయన్నారు. ఇలాంటి క్రీడల వల్ల సోదర భావం, స్నేహభావం పెరిగి వ్యక్తుల మధ్యలో బంధాలు ఇంకా ఎక్కువ పెరగ డానికి అవకాశం ఉందన్నారు. అంతకు ముందు జాతీయ పతాకాన్ని ఎంపీ నాగరాజు, సీబీఎస్ఈ ఫ్లాగ్‌ను పుల్లయ్య, స్కూల్, స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను రవీంద్ర విద్యా సంస్థల ఛైర్మన్ మోహన్ కుమార్ ఆవిష్క రించారు. క్రీడాకారుల నుంచి అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. రిడ్జ్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టు కున్నాయి. కార్యక్రమంలో రిడ్జ్ పాఠశాల సీఈవో గోపీనాథ్, గ్లోబల్ స్కూల్ సీఈవో వంశీదర్, టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి, పాఠశాల డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్ కమల్, రవీంద్ర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మమతా మోహన్, రిడ్జ్ స్కూల్ సమన్వయకర్త సౌమ్య గోపీనాథ్, టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, జిల్లా అభివృద్ధి అధికారి భూపతిరావు, టోర్నమెంట్ మెడికల్ టీం వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథరెడ్డి, ఫిజియోథెరపిస్టు డాక్టర్ హనీర్ బాషా పాల్గొన్నారు.

ప్రారంభ మ్యాచ్ అండర్-19 విభాగంలో హైదరాబాద్ డిపిఎస్ పాఠశాల, హైదరాబాద్ స్లోగ్ బిర్లా పాఠశాల తిరుపతి వారిపై 3-1 గోల్స్ తేడాతో గెలుపొంది శుభారంభం చేశారు. ఇప్పటి వరకు అండర్-19లో చిన్మయ విద్యాలయ హైదరాబాద్, హార్ట్‌ఫుల్‌నెస్ లర్నింగ్ సెంటర్ రంగారెడ్డి, కాకతీయ పబ్లిక్ స్కూల్ గాజువాక, ఇండస్ యూనివర్సల్ స్కూల్ మల్కాజ్‌గిరి జట్లు విజయం సాధించాయి.

గుండెను పదిలంగా కాపాడుకోవాలి

- ప్రతి రోజు వ్యాయాయం చేయాలి - ఆరోగ్యకర జీవనశైలిని అనుసరించాలి : ఎస్‌పి
- వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్/హాస్పటల్

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని, మన గుండెను మనమే కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కర్నూలు కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కర్నూలు రాజ్ విహార్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని జిల్లా ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ మన గుండెను మనం కాపాడుకుంటూ ఇతరులను కూడా అప్రమత్తం చేయటానికి ఈ అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. అవగాహన ర్యాలీని కిమ్స్ హాస్పిటల్ వారు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 40 నుండి 50 ఏళ్ళ పైబడిన వ్యక్తులందరూ గుండె సంబంధిత పరీక్షలు చేయుంచుకోవాలని సూచించారు. ముందు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని తెలిపారు. ఏదైనా సమస్యలుంటే వాటిని గుర్తించి వైద్య పరీక్షలు చేయించుకుంటే మంచిదని చెప్పారు. జంక్ ఫుడ్ తీసుకోవడం మానివేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం ప్రతి రోజూ 30 నిమిషాల పాటు వాకింగ్ చేయాలని సూచించారు. మంచి అలవాట్లతో ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. కర్నూలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ గుండెపోటు వస్తుందని తెలిపారు. రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్ సాధారణ మోతాదులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై మల్లికార్జున, కిమ్స్ ఆస్పత్రి సిఒఒ సునీల్, వైద్యులు నాగేంద్ర ప్రసాద్ తోట, సందీప్ కూమార్, అరుణ, పీటర్ ప్రవీణ్, ఫరూక్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఇపిని రద్దు చేయాలి

- విద్యా సదస్సులో పలువురు వక్తలు



విద్యా సదస్సులో మాట్లాడుతున్న సాయి గోపాల్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఈపి-2020ను రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూల్ సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తలుగా మానవ హక్కుల ఉద్యమ నాయకులు చంద్రశేఖర, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈ.వెంకటేష్‌లు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానం ఎంతో ప్రమాదకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మాతృభాషను విస్మరించి ఇంగ్లీష్ మీడియంలోనే విద్యాబోధన జరగడం బాధాకరమన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఇంటర్మీడియట్ విద్యను స్కూల్ విద్యలో విలీనం చేయడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు విధానంతోపాటు జీవో నెంబర్ 117ను కూడా రాష్ట్రంలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్లస్టర్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్ మొదట ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎన్.రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.గోవిందరాజులు, రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షులు టి.వెంకటరెడ్డి, కార్యదర్శి వి.హరీష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్వామా పీడీని సన్మానిస్తున్న దృశ్యం

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని వెంకటరమణ కాలనీలోని మానవతా స్వచ్ఛంద కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రకృతిలో ఉన్న సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేయాలని కోరారు. అమర్నాథ్ రెడ్డిని సంస్థ జిల్లా కన్వీనర్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ యుగంధర్ శెట్టి, మానవత నగర అధ్యక్షులు శోభన్ బాబు, మానవత యూనిట్ డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ పాటిల్ హనుమంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు శివారెడ్డి పాల్గొన్నారు.

బీచ్ సెపక్ తక్రా క్రీడాకారునికి సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

చైనా దేశంలోని కింగ్ డావోలో ఈ నెల 18 నుంచి 23 వరకు జరిగిన ఆసియా బీచ్ సెపక్ తక్రాలో పురుషుల భారత జట్టు కాంస్యం పతాకాన్ని దక్కించుకుందని, భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న కురువ మధుకు ఆదివారం శ్రీ భీరప్ప దేవాలయం ప్రాంగణంలో కర్నూలు జిల్లా కురువ సంఘం నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. రూ.5వేలు పారితోషికం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా కురువ సంఘం అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, మాజీ అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎంకె రంగస్వామి, కోశాధికారి కెసి నాగన్న, పాలసుంకన్న జిల్లా మహిళా సంఘము అధ్యక్ష కార్యదర్శులు శ్రీలీల, కే.అనిత పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : నగరంలోని స్థానిక పాతబస్తీలో ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఇండియా విజన్ ఇన్స్టిట్యూట్ స్వచ్ఛంద సంస్థ చెన్నై సహకారంతో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ మహేశ్వరి, డాక్టర్ అమీర్ ఖాన్, వారి సహాయకులు ఓబులేసు, శ్రీనివాసులు విద్యార్థులకు ఉచితంగా కంటి స్క్రీనింగ్ పరీక్షలను చేపట్టారు. విద్యార్థులకు ఒక జత కంటి అద్దాలు ఆపరేషన్ ఐ సైట్ యూనివర్సల్ వారి సహకారంతో ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్ నిరంజన్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.పుష్పరాజ్, ఉపాధ్యాయులు పి.షకూర్, యం.విజయకుమార్ పాల్గొన్నారు.

కూటమిలో కుమ్ములాటలు

- ఆదోనిలో ఎమ్మెల్యే పార్థ సారథి వర్సెస్ మీనాక్షి నాయుడు



ఎమ్మెల్యే పార్థసారథి



టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గ కేంద్రంలో కూటమి నేతల మధ్య కుమ్ములాటలు మొదలై కుంపట్లు రాజేస్తుంది. సర్ది చెప్పాల్సిన వారు లేకపోవడంతో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీనాక్షి నాయుడుల మధ్య ఆగాధం పెరిగిపోతోంది. మొన్నటి వరకు ఒకరిపై ఒకరు పరోక్షంగా విమర్శలు చేసుకోగా ప్రస్తుతం ఒకరంటే ఒకరు గిట్టని విధంగా పరిస్థితి మారిపోయింది. ఆదోని నియోజకవర్గంలో తమ ఓట్లతోనే గద్దెనెక్కిన ఎమ్మెల్యే పార్థసారథి పట్టించుకోవడంలేదని ఇటీవలనే బహిరంగంగానే మీనాక్షి నాయుడు విమర్శలు గుప్పించారు. అలాగే బిజెపి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ కూడా ఎమ్మెల్యే పార్థసారథికి వ్యతిరేకంగా పెదవి విరిచారు. కూటమిగా సమిష్టి కబుషితోనే ఎమ్మెల్యేగా గెలుపొందారని ఒంటెద్దుపోకడతో వ్యవహరిస్తే సహకరించేది లేదని ఇటీవల నాగలాపురం గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ ఎమ్మెల్యేపై మండిపడ్డారు. ఇదేమి పట్టని విధంగా పార్థసారథి జనసేన ఇన్‌ఛార్జి మల్లప్పతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉన్నారు. గత వారం వైఎంకె హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి హాజరయ్యారు. ఆ సభలో తిక్కారెడ్డి మీనాక్షి నాయుడు ప్రసంగం ముగిసింది. ఎమ్మెల్యే పార్థసారథి ప్రసంగం పూర్తికాకుండానే తెలుగు తమ్ముళ్లు సభ నుంచి బయటకు రావడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఎమ్మెల్యే వ్యవహారం నచ్చక బాయ్‌కాట్ చేస్తున్నామని కొందరు తెలిపారు. ఎమ్మెల్యేను అవమానం చేయడం టిడిపి వారికి తగదంటూ ఆయన అనుచరులు వాపోయారు. శనివారం ఎమ్మెల్యే పార్థసారథి, మీనాక్షి నాయుడు వర్గీయుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. అన్న క్యాంటీన్ల మరమ్మతు పనులకు సంబంధించిన అంశాన్ని మున్సిపల్ కౌన్సిల్ అజెండాలో తొలగించారని తెలుసుకొని టిడిపి నాయకులు రంగస్వామి నాయుడు, తిమ్మప్ప, బుద్ధారెడ్డి, బాబు నాయుడులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అక్కడ ఉన్న ఎమ్మెల్యేను నిలదీశారు. తమ ఓటుతోనే అధికారంలోకి వచ్చారన్న సంగతి మరవద్దని ఎమ్మెల్యేకు చురకలంటించారు. అన్న క్యాంటీన్ల .మరమ్మతులు నాసిరకంగా ఉన్నాయని, బిల్లులు చేస్తే అధికారుల మెడకు చుట్టుకుంటుందని ఎమ్మెల్యే బహిరంగంగానే ప్రకటించారు. అధికారులకు వాహనాల అద్దె విషయంపై కూడా రగడ ప్రారంభమైంది. వైట్ బోర్డు ఉన్న వాహనాలను మాత్రమే అధికారులకు ఇవ్వాలని, డ్రైవర్లను కూడా యజమానులే నియమించాలని చెప్పడంతో వాహనాలు సమకూర్చిన మీనాక్షి నాయుడు వర్గం నాయకులు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వెళ్లగక్కారు. ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకోవడం మినహా ఆదోని అభివృద్ధి పట్టదా అంటూ ఆదోని పురవాసులు ప్రశ్నిస్తున్నారు. కూటమిలో కుంపట్లు చల్లారేలా చూడాలని లేనిపక్షంలో ప్రజల నుండి వ్యతిరేక చవి చూడాల్సి వస్తుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం రాజశేఖర్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్, నాయకులు ఎస్‌డి ఖాజా పాషా, మహబూబ్ బాషా ఆదివారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పెరిగిన ధరలు పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయని, ధరలు ఆకాశాన్ని అంటుకుంటున్నాయని తెలిపారు. నూతనంగా వచ్చిన తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి మరీ భారాలు పెంచుతున్నాయని పెట్రోల్, డీజిల్ వంట గ్యాస్ ధరలు అంతర్జాతీయంగా తగ్గినప్పటికీ ఇక్కడ ధరలు తగ్గకపోగా ప్రజలపై మోయలేని భారాలను వేస్తూ ఉన్నాయని విమర్శించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- నేడు ధర్నాను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి జిపి వీరన్న డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల ధర్నాకు సంబంధించి కరపత్రాలు పంచుతూ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు కొన్ని సంవత్సరాలుగా గ్రామాన్ని శుభ్రత పరుస్తూ మలినాలను ఎత్తివేస్తూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న జరిగే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మంత్రులు పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడగడం, సత్కరించడం మంచిదేనని, దానితో వారి కడుపులేమి నిండవని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, అచ్చమ్మ, సుంకులమ్మ, సంజప్ప, వెంకటేశులు, అయ్యస్వామి, చంద్రమోహన్, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

- శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మల

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇటీవల కాలంలో విద్యార్థినులపై, మహిళలపై జరుగుతున్న దాడులు అత్యాచారాలను అరికట్టి రక్షణ కల్పించాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని స్థానిక బాలికల సంక్షేమ వసతి గృహంలో భగత్ సింగ్ 117వ జయంతిని ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగర సహాయ కార్యదర్శి మల్లేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి నిర్మల, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితాన్ని విద్యార్థులు తప్పనిసరిగా అధ్యయనం చేయాలన్నారు. ఆయన జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గర్ల్స్ నాయకురాలు పావని, దివ్య పాల్గొన్నారు.


నేడు ఫిర్యాదుల స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాధితులు నేరుగా ఇక్కడికి వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు చనుగొండ్ల విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - గూడూరు



మండలంలోని చనుగొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఐశ్వర్య రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక అయింది. తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఐశ్వర్య పాల్గొంటుంది. విద్యార్థిని ఐశ్వర్య ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూల్ సాహెబ్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యుఆర్ఎ రవికుమార్, జి.నవీన్ పాటి, గూడూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కాంతారావు, ఎస్ షబ్బీర్ బాషాలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా

ప్రజాశక్తి - పత్తికొండ

రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామానికి అక్టోబర్ 1న ముఖ్యమంత్రి రానున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌లు ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ ముందుగా హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పంపిణీ చేయనున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారుల గృహాలను కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్న శిలాఫలకాన్ని పరిశీలించారు. అనంతరం బహిరంగ సభ వేదిక ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. టెంపుల్‌లో దర్శనం చేసుకున్న అనంతరం అక్కడి నుండి సభా వేదిక వద్దకు చేరేందుకు 4 అడుగుల వెడల్పుతో దారిని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ నాణ్యతతో ఉండాలన్నారు. అదే విధంగా ప్రజలకు కనిపించేలా ఎల్ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో విద్యుత్, ఫైర్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.




ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్‌పి బిందుమాధవ్

బాధిత కుటుంబానికి 'చేయూత'

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

మండల కేంద్రమైన పెద్దకడబూరులో నివాసముంటున్న రవి కుటుంబానికి సంబంధించిన ఇల్లు గత బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోయి శాంతిరాజు కుటుంబం కట్టుబట్టలతో బయటపడిన విషయం తెలుసుకొని ఎమ్మిగనూరు లోని చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారికి చేయూత స్వచ్ఛందం సేవా సంస్థ ద్వారా సేకరించిన విరాళం రూ.22000 ఆదివారం శాంతిరాజు కుటుంబానికి అందించారు. స్థానిక నందవరం మండలం జడ్పిటిసి నిఖిల్ చక్రవర్తి నుండి బాధిత కుటుంబం విషయాన్ని తెలుసుకొన్న చేయూత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ప్రసన్న రాజు బృందం బాధిత కుటుంబాన్ని సందర్శించి జరిగిన సంఘటన గురించి తెలుసుకున్నారు. బాధితుడు చెప్పిన విషయాల ప్రకారం గత బుధవారంవిద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల వారు నివాసముంటున్న ఇల్లు పూర్తిగా దగ్ధమైందని ఆ ఇంటిలోని అన్ని వస్తువులు ఖాళీ బూడిదపాలైనాయని విలపించారు. పెట్టెలో మిరప పంట నుంచి వచ్చిన రూ.లక్షన్నర డబ్బు తో సహా రూ.9 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఈ కుటుంబాన్ని ప్రభుత్వము ఆదుకోవాలని బాధిత కుటుంబానికి ఇల్లు కట్టించి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. మాకు తోచిన సహాయాన్ని తక్షణ సహాయంగా వారికి అందించగలుగుతున్నామని వారు అన్నారు.చేయూత స్వచ్ఛంద సంస్థకు విరాళాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రజలు కూడా తమ తమ గహాల యందు విద్యుత్తు సరఫరా కొరకు వేసుకున్న తీగలను జాగ్రత్తగా ఏర్పాటు చేసుకోవాలని ,గృహంలో గ్యాస్ స్టవ్ ల విషయంలో ఉంచిన సిలిండర్లను కూడా జాగ్రత్తగా ఉంచుకొని ప్రమాదాల నుంచి దూరంగా ఉండాలని కోరారు. చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రవీణ్, సుధాకర్,ప్రకాష్,రామచంద్ర జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండలం అధ్యక్షులు శావల బుజ్జి బాబు నందవరం మండల జడ్పిటిసి నిఖిల్ చక్రవర్తి, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండలం ప్రధాన కార్యదర్శి శావల శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థికసాయం ఇస్తున్న చేయూత స్వచ్ఛంద సంస్థ

విశ్వనరుడు జాషువా

ప్రజాశక్తి - ఆదోని

సమాజం మేలు కొలుపు కోసం అనేక రచనలు చేసిన గుర్రం జాషువా విశ్వనరుడని చాటి చెప్పిన మానవతావాది అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప పేర్కొన్నారు. జాషువా 129వ జయంతి సభ ఆదివారం కిడ్డీస్ హైస్కూల్‌లో అరసం జిల్లా అధ్యక్షులు కలం ప్రహ్లాద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరికంలో ఉన్న కూడా ఒకరి మెప్పు కోసం కాకుండా కుల మతాలకతీతంగా దోహదపడే రచనలు చేసి అందరివాడిగా గుర్రం జాషువా పేరు తెచ్చుకున్నారన్నారు. ఆరసం జిల్లా అధ్యక్షులు ప్రహల్లాద మాట్లాడుతూ జాషువా సాహిత్యం, జీవితం అభ్యుదయ భావాలతో సాగిందన్నారు. బల్లేకల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యా మాట్లాడుతూ జాషువా పేదరికం, వివక్ష ఎదుర్కొంటూ ఫిరదౌసి, గబ్బిలం లాంటి గొప్ప గ్రంథాలు రాసి ఛీత్కారాలు పొందిన చోటే సత్కారాలు పొందిన సత్కవి అని కొనియాడారు. కవి డాక్టర్ నల్లారెడ్డి ఆలాపించిన జాషువా సత్యహరిశ్చంద్ర పద్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు చిగిళి లక్ష్మన్నయాదవ్‌కు నల్లారెడ్డి సన్మానించారు.కార్యక్రమంలో సాహితీ స్రవంతి, అరసం సభ్యులు పాల్గొన్నారు




జాషువా జయంతి సభలో మాట్లాడుతున్న సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులుఆవుల బసప్ప

పార్థు నటన మానుకో...

టిడిపి సీనియర్ నాయకుడు రంగస్వామి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి నటన మానుకోవాలని, ఆయన పద్ధతి మార్చుకోక పోతే తగిన గుణపాఠం తప్పదని టిడిపి సీనియర్ నాయకుడు, కాంట్రాక్టర్ రంగస్వామి నాయుడు హెచ్చరించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు చేసిన పనుల్లో నాణ్యత ఉన్నాయా లేదా అనే విషయం తేల్చాల్సింది ఇంజనీర్లని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి డాక్టరే అనుకున్నామని అయితే ఆయన ఇంజనీర్‌గా వ్యవహరిస్తూ అన్న క్యాంటీన్ల నిర్మాణ పనుల్లో నాణ్యత లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంతటి ఇంజనీరింగ్ నైపుణ్యత ఉంటే పోలవరం డ్యామ్, అమరావతి నిర్మాణాల్లో నాణ్యత పరిశీలించి అక్కడ అక్రమాలు జరిగి ఉంటే ప్రభుత్వానికి నివేదిక సమర్పించి కోట్లాది రూపాయలు నిధులు కాపాడాలని సూచించారు. ముందుగా బిజెపిలో ఉన్న వివాదాలను సరి చేసుకోవాలని, టిడిపిలో ఉన్న విభేదాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ అధిష్టానం సరిచేస్తుందన్నారు. టిడిపి విభేదాలతో తనకేం పని ఉందని ప్రశ్నించారు. తనను టిడిపి వారు గెలిపించలేదని ఎమ్మెల్యే పార్థసారథి చెబుతున్నారని, నిజంగా ఎమ్మెల్యేకు దమ్ముంటే ఇటీవల వైసిపి నుంచి బిజెపిలో చేరిన కౌన్సిలర్లను రాజీనామా చేయించి గెలిపించుకోవాలని సవాల్ విసిరారు. దమ్ముంటే రూ.వేయికోట్ల నిధులు తెచ్చి ఆదోని నియోజకవర్గంలో అన్ని సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన కొద్దిపాటి నిధులలో తన పెత్తనం ఏమిటన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు బసాపురం రామస్వామి, బుద్ధారెడ్డి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, వెంకటేష్ చౌదరి, గోనుబావి గోపాల్, సుబ్బు, ఒకటో వార్డు టిడిపి ఇంచార్జి వెంకటేష్, రాయనగర్ శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి సీనియర్ నాయకుడు రంగస్వామి నాయుడు

కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ స్టాఫ్‌నర్స్‌ల వేతనాలు ఇవ్వాలి

30 న కలెక్టరేట్లో ధర్నా విజయవంతం చేయాలి

ప్రజాశక్తి ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అన్ని విభాగాలలో పనిచేయుచున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు సమావేశం సిఐటియు తాలూకా కార్యదర్శి రాముడు ఆధ్వర్యంలో రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు తాలూకా కార్యదర్శి ఇప్పుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి హెల్త్ కార్మికులను ప్రతిసారి మోసం చేస్తున్నారని తెలిపారు అదే విధంగా 2020 వ సంవత్సరంలో సుప్రీం కోర్టు రెగ్యులర్ చేసేంతవరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇచ్చిన ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని తెలియజేశారు. ఎమర్జెన్సీ భాగమైన హెల్త్ డిపార్ట్మెంట్లో పనిచేసే కార్మికులకు పది నెలల నుండి జీవన ఇవ్వకపోవడం బాధాకరమని, కాబట్టి డిఎంహెచ్ఓ తీసుకొని పెండింగ్ వేతనాలను తక్షణమే ఇచ్చే విధంగా అదేవిధంగా మహిళ ఏఎన్ఎం, ఎన్ హెచ్ ఎం నర్సులు యొక్క సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 30వ తేదీన కలెక్టరేట్ దగ్గర చేసే ధర్నా విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే వీరేష్, దొరబాబు, ఈరమ్మ ,సుబ్రహ్మణ్యం, రవికుమార్, అశోక్ కుమార్ కంప్యూటర్లో ల్యాబ్ టెక్నీషియన్లు ఏఎన్ఎం, ఎన్ హెచ్ ఎం,హెల్త్ కార్మికులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న సిఐటియు తాలూకా కార్యదర్శి రాముడు

సాయి నగర్ సమస్యల పరిష్కారానికి కృషి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాబోవు కాలంలో రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని ఆదోని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి రమేష్ యాదవ్, డిసిసి మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ దొక తెలిపారు. ఆదివారం ఆదోని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సాయి నగర్ వాసులు కాంగ్రెస్ పార్టీ నాయకులను పూలమాల శాలువాతో సన్మానం చేశారు. వారు మాట్లాడారు. సాయి నగర్‌లో కనీస మౌలిక సదుపాయాల కల్పన కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. కార్య క్రమంలో యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవిశెట్టి వీరేష్, విద్యార్థి సంఘం నాయకులు శ్రీనిత్ రాయల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్ యాదవ్, వెంకటేష్, కాలనీ వాసులు ఉన్నారు.





మృతురాలి కుటుంబానికి టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

మండలంలో హాలహార్వి గ్రామం టిడిపి కార్యకర్త భాస్కర్ చెల్లెలు మంజుల (45) అనారోగ్యంతో మృతి చెందింది.ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఫోన్ చేసి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి తెదేపా అండగా ఉంటుందని తెలిపారు. టిడిపి ఎస్సీసెల్ అధ్యక్షులు దావీదు, మాజీ సర్పంచ్ దాసులు మృతిచెందిన మంజుల భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. వారికి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టిడిపి నాయకులు ప్రభుదాస్, ఆంద్రయ్య, గాలి శాంసోన్, సల్మోన్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణ కోసం హెల్ప్ లైన్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మారుతున్న వాతావరణ పరిస్థితులు, చీడపీడల బెడద రైతులను ఆందోళనకు గురి చేస్తోందనీ, ఇలాంటి విపత్కర పరిస్థితుల నుండి రైతులను గట్టెక్కించడానికే హలో గోద్రెజ్ హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సింగ్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రాంతీయ భాషల్లో రైతన్నలకు అందుబాటులో ఉండేలా రూపొందించిన బృహత్తర కార్యక్రమమని అభివర్ణించారు. దీని ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో చేయూతనివ్వడంతో వ్యవసాయ ఉత్పాదన మెరుగుపరచాలన్న సంకల్పంతోనే ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి పనిలో రైతు కుటుంబాల అభ్యున్నతి ప్రధాన మైనదని, రైతు కుటుంబాలు బాగుండాలన్న వారు సాగుచేసిన పంటలు మంచి దిగుబడి కోసం సరైన సమయంలో సరైన పరిష్కారాల లభ్యత, వినియోగం తప్పని సరి అన్నారు.



తైక్వాండో క్రీడాకారులతో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శమంతకమణి

ఆత్మ రక్షణ క్రీడ తైక్వాండో

- మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శమంతకమణి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఆత్మ రక్షణ కోసం తైక్వాండో క్రీడ ప్రతి విద్యార్థిని, విద్యార్థికి అవసరమని మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎన్. శమంతకమణి పేర్కొన్నారు. కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న కేఎంసి పార్క్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దసరా సెలవుల్లో విద్యార్థులు ఆత్మరక్షణ క్రీడలను సాధన చేయాలని, నగరంలో ఆత్మ రక్షణ క్రీడ శిక్షణా కేంద్రాలు చాలా ఉన్నాయని, తల్లిదండ్రులు గమనించి ప్రత్యేకతంగా అమ్మాయిలను సాధన చేయించాలని కోరారు. కొండారెడ్డి బురుజు తైక్వాండో శిక్షణా కేంద్రంలో క్రీడాకారులకు నగరూరు సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సహాయ, సహకారాలు అందజేస్తామని తెలిపారు. క్రీడల్లో పాల్గొన్న 40 మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు టి వెంకటేశ్వర్లు, టి అజయ్, నందిని, అశ్విని, లలిత, హరికృష్ణ, తిలక్, అఖిల్, విశ్వాసరావు పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కెజిబివి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - గోనెగండ్ల

కర్నూలులో అవుట్ డోర్ స్టేడియంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో గోనెగండ్ల కస్తూరిబా గాంధీ విద్యార్థినిలు ప్రతిభ చాటారు. 63 కేజీల విభాగంలో ఎం లావణ్య ప్రథమ స్థానం, జె ప్రమీళ ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటినట్లు కెజిబివి పిఈటి కళ్యాణి తెలిపారు. వీరిని సిఐడి సిఐ నరేష్ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి: ఎఐటియుసి

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు : ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ, కార్మికుల తొలగింపనకు కేంద్ర ప్రభుత్వం పూనుకొంటే సహించేది లేదని ఎఐటియుసి తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వీరేష్, తిమ్మ గురుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఆదివారం సోమప్ప సర్కిల్లో ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమలో 4290 మంది కాంటాక్ట్ కార్మికులను తొలగించాలని ఈ క్రమంలో వారి గేట్ పాసులు వెనుక్కు తీసుకోవాలని స్టీల్ ప్లాంట్ యజమాన్యం ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఉక్కు కార్మికులపై కేంద్రంలోని మోడీ సర్కార్, స్టీల్ ప్లాంట్ యజమాన్యం అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై ఎఐటియుసి కార్మిక సంఘం సమరశీల పోరాటాలకు నాంది పలుకుతుందన్నారు. స్టీల్ ప్లాంట్‌లో రిటైర్ అవుతున్న వారి స్థానంలో ఐదేళ్ల కాలంలో కొత్త వారిని రిక్రూమెంట్ చేయడం లేదని, నానాటికి కార్మికుల,ఉద్యోగాల సంఖ్య తగ్గుతున్న క్రమంలో ఉన్న వారిపై పని ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. ఈ తరుణంలో కొత్త కార్మికులను రిక్రూమెంట్ చేయవలసింది పోయి ఉన్న వారిని తొలగించేందుకు ప్రయత్నించడం దారుణమని అన్నారు. స్టీల్ ప్లాంట్ ను రక్షిస్తాం, కార్మికుల ఉద్యోగ భద్రత కల్పిస్తాం అన్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చర్యలను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటనలు గుప్పిస్తూనే కాంట్రాక్ట్ కార్మికులం తొలగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కుతంత్రాలను కార్మికుల అర్థం చేసుకుంటున్నారని, ప్లాంటును కావాలనే నష్టాల వైపు నెట్టుతూ కోలుకోలేని దెబ్బతీస్తుందన్నారు. ప్రస్తుతం ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌ను మాత్రమే నడుపుతూ కొన్ని విభాగాలను మూసివేయడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి సర్కారు, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికులను మభ్యపెట్టే ప్రకటనలను చేయడంపై కార్మికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. సెయిల్ లో విలీనం పక్రియ అయిపోయినట్టు కేంద్రం 2500 కోట్లను రుణం చేస్తున్నట్లు ప్రైవేటీకరణ అయిపోయినట్టు వార్తలు రావడం దుర్మార్గమని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉక్కు ప్రైవేటీకరణ నువిరమించుకున్నట్లు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కార్మిక నాయకులు ఎల్లప్ప, సుంకన్న, నరసప్ప, విజయ్, శేఖర్,రవి,ఫకీర్ సాబ్,శివ, గోపాల్, నర్సోజి,ఖలీల్,రవి, జబ్బర్,భాస్కర్ యాదవ్,చిన్నన్న, మాలిక్,సమీ ఉల్లా,రాజీవ్, నరసింహులు, రవి పాల్గొన్నారు



సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు

హృదయ సమస్యల పరిష్కారికి కృషి

మెడికవర్ హాస్పటల్ కార్డియాలజిస్టులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా,గుండె ఆరోగ్య సమస్యల గురించి తెలుపుతూ డాక్టర్ బి.ఎస్. ప్రవీణ్ కుమార్, డాక్టర్ చైతన్య కుమార్, డాక్టర్ సిఎస్. తేజ నందన్ రెడ్డి కన్సల్టెంట్ కార్డియాలజిస్టులు మాట్లాడుతూ తాము ప్రజలకి వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. సమగ్రమైన హృదయ సంరక్షణను అందించడానికి మెడికోవర్ హాస్పిటల్ కర్నూలు అంకితమై ఉందని అన్నారు. ఈ ప్రత్యేకమైన రోజు హృదయ వ్యాధి నివారణ, ప్రమాద కారకాలు, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం గురించి తెలుసుకోవడానికి అవకాశాన్ని అందిస్తుందని చెప్పారు. ముఖ్యంగా యువతలో, హృదయ వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు.
అధిక కొవ్వు ఆహారం,వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి వంటి అనారోగ్య జీవనశైలి హృదయ సమస్యలకు ప్రధాన కారణాలు అని తెలిపారు. హృదయ వ్యాధులను నివారించడానికి ఆరోగ్యకర మైన జీవనశైలిని అలవరుచుకుని.రెగ్యులర్ వ్యాయామం, సమతుల ఆహారం,సరిపోయిన నిద్ర అవసరమని అన్నారు. రెగ్యులర్ చెక్ అప్ చేయించుకోవడం వల్ల గుండు సమస్యల నుంచి జాగ్రత్త ఉండవచ్చని అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం గుర్తు చేసుకుంటూ, గుండె ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలిపారు.





ప్రమాదకరంగా వేలాడుతున్న 11 కెవి విద్యుత్ తీగలు

ప్రజాశక్తి మద్దికేర : ప్రజలకు ప్రమాదకరంగా వేలాడుతున్న లెవెన్ కె.వి విద్యుత్ తీగలను తొలగించాలని గ్రామస్తులు తెలిపారు. మండల పరిధిలోని యడవలి గ్రామస్తులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 కెవి విద్యుత్ తీగలు కిందకి వెళ్లాడటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని కోరారు. గ్రామానికి సమీపంలో ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ తీగలను సంబంధిత అధికారులు తక్షణమే తొలగించి ప్రజలను కాపాడాలని పేర్కొన్నారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వేమన్న రామకష్ణ పాల్గొన్నారు.

కష్టాల్లో లేయర్ కోళ్ల పరిశ్రమ

- బేజారెత్తిస్తున్న మేత ధరలు
- పెంపకంపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

గుడ్లు ఉత్పత్తి చేసే లేయర్ కోళ్ల పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోతోంది. మేత ధర ఆకాశాన్నంటడం, గుడ్డు ధరలు ఎగుడు దిగుడులతో ఉత్పత్తిదారులు నష్టపోతున్నారు. క్రమేణా లేయర్ కోళ్ల పెంపకానికి దూరమవుతున్నారు. దీంతో, కొన్ని ప్రాంతాల్లో ఇందుకు సంబంధించిన షెడ్లను సైతం తొలగిస్తున్నారు. గుడ్లు ఉత్పత్తి చేసే లేయర్ ఫౌల్ట్రీ ఫారాల్లో కోళ్లకు అందించే దాణాలో 55 శాతం మొక్కజొన్న, నూకలు వాడతారు. గత రెండేళ్లగా నూకలు, బియ్యం, మొక్కజొన్న తదితరాలు ఇథనాల్ పరిశ్రమలకు ఎక్కువగా తరలిపోతుండడంతో వాటి ధరలు పెరిగిపోతున్నాయి. రెండేళ్ల క్రితం మొక్కజొన్న ధర టన్ను రూ.19,500 ఉండేది. ప్రస్తుతం రూ.27 వేలకు చేరింది. నూకలు ధర రూ.18 వేల నుంచి రూ.28 వేలకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గత ఆగస్టులో ఎన్నడూ లేనివిధంగా కోళ్ల మేత ధర టన్ను రూ.30 వేలకు చేరుకుంది. ప్రస్తుతం కొద్దిగా తగ్గినా గతేడాదితో పోలిస్తే టన్నుకు రూ.2 వేలు అధికంగా ఉంది. గతేడాది టన్ను మేత రూ.25 వేలకు విక్రయించగా, తాజాగా రూ. 27 వేలకు విక్రయిస్తున్నారు. కోళ్ల ఫారం నిర్వహణ, గుడ్ల ఉత్పత్తికి ముందు కోడి పెంపకం, రోజువారీ మేతలు, విద్యుత్, ఇతర ఖర్చులన్నీ కలుపుకుంటే ఒక గుడ్డు ఉత్పత్తికి సగటున రూ.4.95 వ్యయం అవుతోందని ఫౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 25 వరకు రైతులకు గుడ్ల ధర సగటున రూ.4.90 మాత్రమే వచ్చింది. ఒక్కో గుడ్డుకు సగటున ఐదు పైసల వరకు నష్టపోయారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలాల్లో, ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు, మైలవరం, విస్సన్నపేట మండలాల్లో కోటి 25 లక్షల సామర్థ్యం కలిగిన గుడ్ల ఉత్పత్తి నష్టపోయారు.